www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 28 డిసెంబర్ 2025



రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

- నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-రాజంపేట : రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఆయన రాజంపేట మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని రకాలుగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిపాలన సాగిస్తానన్నారు. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు కూడా చెత్తాచెదారం రోడ్లపై వేయకుండా మున్సిపల్ కార్మికులకు సహకరించాలన్నారు. ప్రజల సహకారంతోనే మున్సిపాలిటీ అభివృద్ధి అన్ని విధాలుగా జరుగుతుందన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో రాజంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది నూతన కమిషనర్‌కు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. వీరి వెంట నందలూరు యువ న్యాయవాది వి.వినయ్ కుమార్ పాల్గొన్నారు.

తర్జన భర్జనలు

- కేబినెట్ సబ్ కమిటీలో జిల్లాల విభజనపై సుదీర్ఘ చర్చ
- రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరులపై అస్పష్టతే
- జిల్లాల స్వరూపం మార్పు దిశగా కసరత్తు
- 31న తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల



రాయచోటిని జిల్లా కేంద్రంగా ఉంచాలంటూ కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న ఆందోళనకారులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాల విభజనపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన విజయవాడ కేంద్రంగా కేబినెట్ సబ్ కమిటీ భేటీ అయింది. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి అసెంబ్లీ కేంద్రాల విభజనపై సుదీర్ఘ కసరత్తు చేసినట్లు సమాచారం. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో అప్పటి కూటమి నాయకుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, మదనపల్లి అసెంబ్లీలను కొత్త జిల్లా కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల అన్నమయ్య జిల్లాకు చెందిన మదనపల్లి కేంద్రంగా కొత్త జిల్లాను ప్రకటించారు. రాజంపేటను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తామన్న హామీని విస్మరించారు. ఆనాటి నుంచి నేటి వరకు రాజంపేట, రైల్వేకోడూరు అసెంబ్లీల పరిధిలో నిరసనలు, నిరాహార దీక్షల వెల్లువ కొనసాగుతోంది. నిరసనలు, నిరాహార దీక్షల నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు సమాచారం. ఈ నెల 28న మరోమారు సబ్ కమిటీలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనుంది. విభజిత జిల్లాల విభజనపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

కడప జిల్లాలోకి రాజంపేట!?

తాజా కేబినెట్ సబ్ కమిటీ భేటీలో రాజంపేట అసెంబ్లీని కడప జిల్లాలో, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో, రాయచోటిని మదనపల్లి జిల్లాలో కలిపితే ఎలా ఉంటుందనే కోణంలో చర్చించినట్లు తెలుస్తోంది. తుది నిర్ణయం తీసుకోవడానికి మరో మారు కేబినెట్ సబ్ కమిటీ భేటీయై తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ నెల 29న కేబినెట్‌లో అన్నమయ్య జిల్లా విభజనపై కూలంకషంగా చర్చించి ఆమోదించనున్నట్లు సమాచారం. అనంతరం కేబినెట్ ఆమోదం లభించిన వెంటనే విభజన ప్రక్రియను పూర్తి చేయనుంది. అనంతరం ఈ నెల 31న జిల్లాల విభజనపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

రాయచోటిని జిల్లా కేంద్రంగానే కొనసాగించాలని నిరసన

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రంగా కొనసాగించాలని టిడిపి నాయకులు ఆందోళన చేపట్టారు. శనివారం రాత్రి ఆర్‌టిసి బస్టాండ్ సర్కిల్ వద్ద రాయచోటి జిల్లా తరలింపుపై ప్రభుత్వం పునరాలోచించి రాయచోటినే అన్నమయ్య జిల్లా కేంద్రంగా కొనసాగించాలని ఆందోళన చేపట్టి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాయచోటి జిల్లా కేంద్రంగానే కొనసాగించాలన్నారు. జిల్లా కేంద్రం మారిస్తే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. త్వరలో బంద్‌కు పిలుపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గాజుల ఖాదర్‌బాషా, రవీంద్రారెడ్డి, సుజాత, జెఎసి నాయకులు, టిడికి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు ఆందోళన చెందవద్దు : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి మార్పుపై ఎవరూ ఆందోళన చెందవద్దని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అన్నమయ్య జిల్లా ముక్కలు కాబోతోందంటూ సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్న వార్తలను నమ్మవద్దని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రజల ఆకాంక్షలను అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. జిల్లా ముక్కలు కాబోతోందంటూ వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

'మహాసభలు' విజయవంతం చేయాలని ప్రచార హోరు

- రాయచోటి, రాజంపేటలో స్కూటర్ ర్యాలీలు



రాయచోటి : పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను విజయవంతం చేయాలనే సంకల్పంతో జిల్లాలో సిఐటియు ప్రచార ఉద్యమం చేపట్టింది. శనివారం రాయచోటి, రాజంపేటల్లో స్కూటర్ ర్యాలీలను నిర్వహించారు. రాయచోటి పట్టణంలో స్కూటర్ ర్యాలీ సందర్భంగా అంగన్వాడీలు కోలాటం ప్రదర్శించారు. మొదట బైక్ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంబమైంది. ర్యాలీని అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు డి.భాగ్యలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమై జగదాంబ సెంటర్, మదనపల్లి రోడ్, శివాలయం, చెక్ పోస్ట్, బంగ్లా, ఠానా మీదుగా మాసాపేట వేంపల్లి క్రాస్ చేరుకొని అక్కడ నుండి తిరిగి బంగ్లా సర్కిల్ వద్దకు చేరుకుంది. అనంతరం అక్కడ సభ నిర్వహించారు. అంగన్వాడీలు ఎర్రజెండాలు చేత బట్టి చేసిన కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలు, పిపిపి విధానం, ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలో కొంసాగించాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ర్యాలీ వెంబడి కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు అఖిలభారత మహాసభలు ఆంధ్ర రాష్ట్రంలో మొదటిసారి జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను చర్చించి భవిష్యత్తు పోరాటాలు రూపొందిస్తారని తెలిపారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, దేశంలోని కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, తీర్మానాలు చేయబోతున్నామన్నారు. మహాసభలో కార్మిక వర్గ సమస్యల పరిష్కారం పోరాటంతో పాటు ప్రజల్లో చైతన్యాన్ని పెంచడానికి ర్యాలీలు నిర్వహించామన్నారు. సిఐటియుకి కార్మిక సమస్యలపై పోరాటాలే కాకుండా, ప్రజల్ని చైతన్యం చేసే బాధ్యత కూడా ఉందని అందుకే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.వి.రమణ, ఓబులమ్మ, యుఇడబ్ల్యుయు డివిజన్ అధ్యక్షులు నాగేశ్వరగౌడ్, మున్సిపల్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ, జిల్లా కోశాధికారి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు చెన్నయ్య, ఇంజినీరింగ్ సెక్షన్ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, హమాలీ సంఘం జిల్లా కన్వీనర్ మాధవ, అంగన్వాడీ యూనియన్ సెక్టార్ నాయకులు శంకరమ్మ, మంజుల, కవిత, అంగన్వాడీలు, మున్సిపల్ కార్యకర్తలు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



రాజంపేట : ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు నాయకులు

రాజంపేట : సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పిలుపునిచ్చారు. మహాసభలకు మద్దతుగా పురపాలక కార్యాలయం నుంచి మార్కెట్ వరకు మున్సిపల్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. రవికుమార్, మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ యూనియన్ కోశాధికారి లక్ష్మీదేవి ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, కార్మికులు రమేష్, పండు, కోనయ్య, రెడ్డి, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి దిశగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు

- కలెక్టర్ నిశాంత్ కుమార్



మాట్లాడుతున్న నిశాంత్‌కుమార్

ప్రజా శక్తి రాయచోటి

రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం ద్వారా రైతులకు అధిక ఆదాయం చేకూరుతుందని జిల్లా, మండల స్థాయిలలో కాల్ సెంటర్‌లను ఏర్పాటు చేసి రైతులు, వ్యాపారస్తులను అనుసంధానం చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రయివేటు కల్యాణ మండపంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం, మార్కెటింగ్ సదుపాయాల కల్పనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంఘాలు వ్యాపార ధోరణిలో వ్యవహరించి మార్కెట్ డిమాండ్ ఆధారిత పంటల వార్షిక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా రైతు పంట దిగుబడుల వివరాలను వ్యాపారస్తులకు, ఎగుమతిదారులకు అందుబాటులో ఉంచి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, రైతులకు నేరుగా మెరుగైన ధరలు కల్పించేలా చేయాలని అధికారులకు సూచించారు. ఉద్యాన ఉత్పత్తుల ధరలు తగ్గినప్పుడు పంటల దిగుబడులను ఎండబెట్టడం, ప్రాసెసింగ్ చేసి విలువ జోడింపు ద్వారా అధిక ఆదాయాన్ని పొందే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో పేరుగాంచిన మామిడి రకమైన వీరబల్లి బెనిషా రకానికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్నందున దానిని అవకాశంగా తీసుకొని ఎక్కువ భాగం ఎగుమతి చేయాలని తెలిపారు. ప్రతి మండలంలో పంటల వివరాలు, రైతుల సంప్రదింపు నంబర్లు, పంటల రాక సమయం వంటి సమాచారాన్ని ప్రదర్శించి, ట్రేడర్లను నేరుగా రైతులతో అనుసంధానం చేయడం, చెల్లింపు విధానాలను సులభతరం చేయడం వంటి వినూత్న ప్రయోగాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో అధికారులు, రైతులు స్వేఛగా తమ అభిప్రాయాలు తెలియజేసి, ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ వర్క్‌షాప్ అనంతరం చర్చించిన అంశాలను కార్యాచరణ ప్రణాళికలు తయారుచేసి నిరంతర కొనసాగింపు చర్యలను అమలు చేస్తామని తెలిపారు. ఇక్కడ చర్చించిన విషయాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లి, మరింత మంది రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జెసి ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌పిఒలను బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కావున రైతులు సంఘటితమై అధిక సంఖ్యలో రైతు ఉత్పత్తి దారుల సంఘాలుగా ఏర్పడాలని తద్వారా రైతులకు తమకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించుకోగలరని తెలిపారు. రైతులు పండించిన పంటలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అమ్మడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చు అని తెలిపారు. ఎఫ్‌పిఒలను బలోపేతం చేయడానికి క్షేత్రస్థాయిలో మరిన్ని అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా ఉద్యాన అధికారిని ఎస్.ఎస్.సుభాషిని మాట్లాడుతూ ఎఫ్‌పిఒలకు పంట కోత అనంతరం నష్టాలను తగ్గించడానికి ఉద్యాన శాఖ ద్వారా కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూమ్‌లు, రైపెనింగ్ ఛాంబర్లు, ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌసులు, శీతల గిడ్డంగులు, సోలార్ డ్రైయర్లను 35 శాతం రాయతీపై ఇవ్వడం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యాన ఉత్పత్తులకు విలువ జోడించడానికి ప్రభుత్వం 35 శాతం రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మంజూరు చేస్తుందని తెలిపారు. ఎపిఇడిఎ మేనేజర్ మాట్లాడుతూ మామిడి, అరటి ఇతర ఉద్యాన పంటలు ఎలా ఎగుమతి చేయాలి, ఎగుమతుల కోసం ఎటువంటి నాణ్యత ప్రమాణాలు పాటించాలి తదితర అంశాలను వివరించారు. ఆర్గానిక్ పంట ఉత్పత్తులకు గ్యాప్ సర్టిఫికేషన్ గురించి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మానస, పీరుసాబ్ మాట్లాడుతూ మామిడిలో ప్రస్తుతం పాటించవలన సమగ్ర సస్యరక్షణ చర్యలు, ఉద్యాన పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి గురించి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జి.శివనారాయణ, డిఆర్‌డిఎ పీడీ ఎం.నాగేశ్వరరావు, ఎపిఎంఐపి పీడీ వై.లక్ష్మీ ప్రసన్న, జిల్లాలోని మామిడి ఎగుమతి దారులు, వ్యాపారస్తులు, ఎఫ్‌పిఒ పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

ప్రజాప్రతినిధులైన కౌన్సిలర్లను ఎలా గౌరవించాలో అధికారులకు తెలియదా?? ప్రోటోకాల్‌ను ఎందుకు పాటించడం లేదంటూ మున్సిపల్ ఛైర్మన్‌తో పాటు పాలకవర్గం సభ్యులంతా కమిషనర్ రవితో పాటు అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారపార్టీ నేతల మాటలు వింటూ తమను అడుగడుగునా అవమాన పరిచేలా వ్యవహరించడం తగదంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఒక దశలో సభ్యుల ఆగ్రహావేశాలతో సమావేశం రసాభాసగా మారింది. శనివారం ఛైర్మన్ ఫయాజ్ అధ్యక్షతన మున్సిపల్ అత్యవసర సమావేశం జరిగింది. మొదటగా మున్సిపాలిటీ అవసరాల నిమిత్తం దాతలు ఉచితంగా అందచేసే ట్రాక్టర్లను వినియోగించే అంశంలో మున్సిపల్ అధికారు తీరుపై కౌన్సిలర్ విజయమ్మ కమిషనర్‌పై ఆగ్రహించారు. మున్సిపాలిటీ ఆర్థిక దుస్థితిని గమనించి దాతలే స్వయంగా ముందుకు వచ్చి ట్రాక్టర్లను యిస్తామంటుంటే వాటిని తీసుకుని వినియోగించుకునేందుకు మీకెందుకు అంతబాధ అంటూ మండిపడ్డారు. ఇదే అంశంపై పలువురు కౌన్సిలర్లు గొంతెత్తడంతో పాటు ఛైర్మన్ సైతం అధికారులపై ఆగ్రహించారు. ఫ్రీట్రాక్టర్ల వినియోగానికి మున్సిపల్ కమిషనర్ ఒప్పుకున్నారు. ఛైర్మన్ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంను పురస్కరించుకుని సబాభవనంను శుభ్రం చేయాలన్న తన ఆదేశాలను పట్టించుకోని అధికారులు ఇక పట్టణాన్ని పరిశుభ్రంగా ఏమి ఉంచుతారంటూ మండిపడ్డారు. తన ఆదేశాలను పాటించని శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ నరసింహాను సస్పెండ్ చేయాలంటూ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం కౌన్సిలర్లు ఈశ్వర్, మదన్, షబ్బీర్, అల్తాఫ్, విజయమ్మ వీధి కుక్కల నియంత్రణలో అధికారులు విఫలలయ్యారంటూ మండిపడ్డారు. వీధి కుక్కల దాడిలో ఒటీవలే ఒక్క యువకుడు ప్రమాదం బారినపడి మరణించడంపై కౌన్సిలర్లు ఆగ్రహించారు. చాలా ప్రాంతాల్లో వీధికుక్కల స్వైరవిహారం కారణంగా రోడ్లపై ప్రయాణించే పరిస్థితి లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలను పట్టుకెళ్ళి వ్యాక్సిన్‌లు వేయించి తిరిగి రోడ్లపై వదిలేయడం తగదన్నారు. తమ వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చెబుతామంటే కమిషనర్ ఫోన్‌ను లిఫ్ట్ చేయడం లేదని, తమ వార్డులలో అభివృద్ధి కార్యక్రమాల అమలు సమాచారం ఇవ్వడం లేదంటూ కమిషనర్‌ను నిలదీశారు. కూటమి నేతల ఆదేశాలను శిరసావహిస్తూ, మంత్రి ఆదేశాలంటూ చెబుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సభ్యులను అవమానించడం కాదా? అంటూ ప్రశ్నించారు. తమ వార్డులలో ముందుగా చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు చేయకుండానే తరువాత చేపట్టిన కూటమినేతల పనులు బిల్లులను ఎలా చేస్తున్నారంటూ కౌన్సిలర్ గౌస్‌ఖార్, అల్తాఫ్,కొలిమిచాన్‌బాష, ఇర్ఫాన్ కమిషనర్‌ను నిలదీశారు. వైస్ ఛైర్మన్ ఫయాజుర్ రహిమాన్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా మున్సిపల్ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఛైర్మన్ మాట్లాడుతూ తమ కౌన్సిల్ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను ప్రచురించిన ప్రత్యేక హోర్డింగ్‌లను పట్టణంలో పలుచోట్ల ప్రదర్శనకు ఉంచాలంటూ కమిషనర్‌కు సూచించారు. మున్సిపల్ పాలకవర్గం ఉందనే విషయాన్ని గుర్తెరిగి పనిచేయాలని, కాదని కూటమి నేతల ఆదేశాల మేరకు పనిచేస్తే ఇబ్బందులు పడకతప్పదంటూ ఆయన కమిషనర్‌ను సున్నితంగా హెచ్చరించారు. రవి థియేటర్ వద్ద ఉన్న పాత ఒహెచ్‌ఎస్‌ఆర్‌ను తొలగించి కొత్త దానిని వెంటనే నిర్మించకపోవడంతో కొత్తపల్లె ప్రాంతానికి తాగునీరు వారానికి ఒక్కసారి కూడా సరఫరా చేయడం లేదని కౌన్సిలర్ భర్త ఇర్ఫాన్ ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్షలోపు నిధులతో చేపట్టే పనుల వివరాలను సమావేశం ముందు ఉంచాలంటూ కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్ కోరారు. **కౌన్సిలర్ల వాగ్వివాదం :** మహిళా కౌన్సిలర్ల స్థానంలో వారి భర్తలు, కుటుంబీకులు సమావేశాలకు హాజరైన అంశంపై కౌన్సిలర్ మదన్ ప్రశ్నించడంపై కౌన్సిలర్ల భర్తలు, కుటుంబీకులైన ఇర్ఫాన్, సుగవాసి శ్యామ్‌కుమార్, షబ్బీర్, ఫయాజ్ అహమ్మద్ మదన్‌మోహన్‌తో వాగ్వివాదానికి దిగడంతో సమావేశం రసాభాసగా మారింది. గతంలో మీ భార్య కౌన్సిలర్‌గా ఉన్నపుడు ఆమె స్థానంలో నీవు సమావేశానికి వచ్చిన విషయం మర్చిపోయావా? అంటూ గొడవకు దిగారు. చివరకు ఛైర్మన్ జోక్యంతో పరిస్థితి సద్దు మణిగింది.



వాగ్వివాదం చేసుకుంటున్న వైసిపి కౌన్సిలర్లు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి: జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా, వాహనదారులు తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ 'ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను, ఫోర్ వీలర్ నడిపే వారు సీట్ బెల్ట్‌ను భారంలా కాకుండా, ప్రాణరక్షణ కవచంలా భావించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో సంభవిస్తున్న మరణాలలో అధిక శాతం తలకు తగిలిన తీవ్ర గాయాల వల్ల లేదా సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల వాహనం నుంచి బయట పడటం వల్ల జరుగుతున్నాయని చెప్పారు. ఒక చిన్న నిర్లక్ష్యం కుటుంబం మొత్తాన్ని కోలుకోలేని దెబ్బ తీస్తుందని, కుటుంబం కోసం ఇంట్లో ఎదురుచూస్తుందని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పట్టణ, గ్రామీణ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. ఫ్లెక్సీలు, కరపత్రాలు, సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. వీలైన చోట్ల సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి నిబంధనల పట్ల అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా ప్రజలందరూ పోలీసు వారికి సహకరించి, ప్రయాణాల్లో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు.

రాజంపేట జిల్లా కేంద్రం కోసం విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-రాజంపేట : రాజంపేట నియోజకవర్గ యువత ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిపోతున్నారని, రాజంపేట కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటైతే ఇక్కడ ఉన్నత స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు వచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, తమ భవిష్యత్తు జిల్లా కేంద్రం పైన ఆధారపడి ఉందని పలు పాఠశాలల విద్యార్థులు తెలియజేశారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆయా పాఠశాలల నుంచి ర్యాలీగా పాత బస్టాండు కూడలికి చేరుకొని జిల్లా సాధన కోసం గత కొంతకాలంగా చేపడుతున్న రిలే దీక్షలకు సంఘీభావం తెలిపారు. అనంతరం మానవహారంగా ఏర్పడి జిల్లా కేంద్రం చేయాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు అబ్బూరి ప్రభాకర్ నాయుడు, పూల భాస్కర్, చిట్వేలి రవికుమార్, నంద కిషోర్, సికిందర్, చల్లా సుధాకర్, రాజశేఖర్ నాయక్, నీలి ఈశ్వరయ్య, రెడ్డయ్య నాయుడు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి

విద్యార్థి దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని, ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.అనురాధ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఓ ప్రయివేటు మండపంలో జిల్లాస్థాయి వృత్తి వికాస ప్రదర్శన జరిగింది. జిల్లాలోని 30 మండలాలకు చెందిన 200 మందికి పైగా విద్యార్థులు మండల స్థాయి విజేతలుగా ఈ కార్యక్రమానికి హాజరై తమ నమూనాలను ప్రదర్శించారు. వివిధ వృత్తుల సమాచారం తెలియజేస్తూ, సమగ్ర శిక్ష ఏర్పాటు చేసిన 20 స్టాళ్లు, విద్యార్థులకు వివిధ వృత్తుల పట్ల సమగ్ర సమాచారాన్ని అందించాయి. ఈ స్టాల్స్ ద్వారా, ఏఏ రంగాల్లో ఏఏ వృత్తులు, ఉన్నాయన్న సమాచారం తెలుసుకోవడానికి విద్యార్థులు ఉత్సుకత ప్రదర్శించారు. చేసే వృత్తుల ఆధారంగా జరిగిన, వృత్తుల వేషధారణ పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ప్రదర్శించిన 150కి పైగా మోడల్స్‌తో కూడిన ఎగ్జిబిషన్, ఎంతో విజ్ఞానదాయకంగా ఉందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమ ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా వృత్తి వికాస ప్రదర్శన కేవలం, ఆంధ్ర రాష్ట్రంలోనే ఏర్పాటు చేయడం జరిగిందని, చిన్న వయసు నుండే విద్యార్థులు తమ అభిరుచులకనుగుణంగా వృత్తులను ఎంపిక చేసుకుని, తదనుగుణంగా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ రాయచోటిలో జరిగిన కెరీర్ ఎక్స్‌పో మంది విద్యార్థులకు పైగా, వృత్తి పర సమాచారం అందించిందని, విద్యార్థులు ఉత్సాహంగా ఈ వృత్తి వికాస ప్రదర్శనలో పాల్గొని తమకు ఇష్టమైన రంగాలను ఎంపిక చేసుకోవడానికి, సమగ్ర శిక్షా చేసిన కృషి సఫలీకృతమైందన్నారు. జిల్లా స్థాయి పోటీల విజేతల ఎంపిక జరిపి వారికి బహుమతులు ప్రదానం చేశారు. బహుమతులు పొందిన విద్యార్థులు అధికారులు అభినందించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు కరుణాకర్, జనార్ధన్, వెంకటరామయ్య, సుమతి, యశోద, చంద్రశేఖర్, భాస్కర్, ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరాజు, మహిళా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు మాధవి, శిరీష, సైన్స్ ఆఫీసర్ ఓబుల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు జాబీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10న పౌరహక్కుల రాష్ట్ర మహాసభలు : ఎపిసిఎల్‌సి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

పౌరహక్కుల సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చీమలపెంట వెంకటేశ్వర్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చిత్రపటం వద్ద తమ సంఘం నేతలతో కలసి పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి) పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరహక్కుల సంఘం గతకొన్ని దశాబ్దాలుగా తెలుగురాష్ట్రాల ప్రజల హక్కుల రక్షణ కోసం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఉద్యమించే హక్కు, జీవించేహక్కులపై ఏరకమైన దాడిజరిగినా ప్రశ్నిస్తూ వస్తోందంటూ చెప్పారు. రాజ్య హింసకు, బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా గొంతెత్తిందని పేర్కొన్నారు. అడవిబిడ్డలైన ఆదివాసిలను అడవుల నుండి తరిమివేసి అక్కడి అపార సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు మతోన్మాద బిజెపి పాలకులు చేస్తున్న యత్నాలను ఎండగడుతూ జనవరి 10వ తేదీన తిరుపతి నగరంలోని గంధమనేని శివయ్య భవన్‌లో రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలకు వక్తలుగా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్, ప్రముఖ గాంధేయవాది హిమాంశుకుమార్, సామాజిక ఉద్యమకారిణి బేలా భాటియాలు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, సామాజికవేత్తలు, హక్కుల కార్యకర్తలు తదితరులు పాల్గొని సభలను విజయవతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం కడప జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్, ఉపాధ్యక్షుడు రెడ్డెయ్య, సహాయ కార్యదర్శి ఎం.రవిశంకర్, పామయ్య, రఘు, రమణ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న పౌరహక్కుల సంఘం నేతలు

నిరసనల హోరు

ప్రజా'దృష్టి'

జిల్లాలో నిరసనల హోరు కొనసాగుతోంది. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను కడప జిల్లాలో కలపాలని, రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, ఎస్‌హెచ్ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ నిరసనలు, నిరాహార దీక్షలు హోరెత్తుతున్నాయి. వైసిపి హయాంలో అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారనే పేరిట కూటమి నాయకత్వం శాస్త్రీయత ఆధారంగా జిల్లాలను విభజిస్తామని హామీనిచ్చింది. కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. కేబినెట్ సబ్ కమిటీ జిల్లాల్లో పర్యటించింది. కూటమి నాయకులైన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ అమలు మేరకు మదనపల్లిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాజంపేటను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించడంపై రాజంపేట, రైల్వేకోడూరు అసెంబ్లీల నియోజకవర్గ వ్యాప్తంగా నిరసనలు, నిరాహార దీక్షల పరంపర కొనసాగుతోంది. తాజాగా కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి అసెంబ్లీలను మూడు ప్రాంతాలుగా విభజిస్తే ఎలా ఉంటుందనే కోణంలో ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రత్యామ్నాయాలు ఆలోచించడం అవాంఛనీయమని గ్రహించాలి. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో టిడిపి జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసింది. టిడిపి జిల్లా అధ్యక్షులుగా ఆర్.శ్రీనివాసరెడ్డి, భూపేష్‌రెడ్డి పోటీదారులుగా నిలిచిన సంగతి తెలిసిందే. ఐవిఆర్‌ఎస్ సర్వే, కార్యకర్తల అభిప్రాయాల పేరుతో నెలల తరబడి నానబెట్టిన అనంతరం జమ్మలమడుగుకు చెందిన సి.భూపేష్‌రెడ్డి, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులుగా సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు నియామకాలపై ఉత్సాహం సన్నగిల్లిందని చెప్ప వచ్చు. అన్నమయ్య జిల్లా చిన్నమండెం, రాయచోటి ఘాట్ ప్రాంతాల్లో తరుచుగా ప్రమాదాలు వాటిల్లడం తెలిసిందే. శనివారం తెల్లవారుజామున రాయచోటి నియోజకవర్గ పరిధిలోని చినమండెం మండల కేంద్రం సమీపంలో కారును అంబులెన్స్ ఢీకొన్ని ఘటనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతి చెందడం ఆందోళన కలిగించింది. నేషనల్ హైవే అధికారులు సంబంధిత ప్రమాదకర ప్రాంతాల్లో సైన్‌బోర్డులు, మద్యపాన డిటెక్టర్లు, స్పీడ్ మీటర్లు ఏర్పాటు, మెర్క్యూరీ లైటింగ్ తదితర ప్రమాద నివారణ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో సంక్రాంతి, నూతన సంవత్సర వేడుకలు, ఇతర ఉత్సావాలకు హాజ రు కావాలనే ఉద్దేశంతో దేశం నలుమూలల నుంచి స్వగ్రామాలకు బయల్దేరిన యువతను ప్రమాదాలు కబళించడం గ్రామాలను విషాదఛాయల్లో ముంచెత్తడం విచారకరమని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ఎస్ఐ నరసింహారెడ్డిని సన్మానిస్తున్న గ్రామనాయకులు

ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నరసింహారెడ్డిని గ్రామ నాయకులు స్వాగతం పలికారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయనను కలిసి కరచాలనం చేసి పూలమాలతో దుశ్శాలు వాతో సన్మానించారు. కార్యక్రమంలో అరవీడు గ్రామ టిడిపి అధ్యక్షుడు రమేష్‌బాబు ఉపాధ్యక్షుడు పశువులేటి సత్యనారాయణ, పాలఏకరి మండలశాఖ అధ్యక్షుడు నాగేశ్వరనాయుడు, ఎస్‌టి యూనియన్ నాయకులు మీటేనాయక్, రామాంజులు నాయుడు పలువురు పాల్గొన్నారు.



స్కూల్ వ్యాన్‌ను అడ్డుకోవడంతో నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులు

స్కూల్ వ్యాన్ అడ్డగింత

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

పట్టణంలోని శ్రీ తులసి స్కూల్ వద్ద విద్యార్థులతో వెళ్లే స్కూల్ వ్యాన్లను శనివారం ఉదయం అరుంధతివాడకు చెందిన ప్రజలు అడ్డుకున్నారని తులసి స్కూల్ కరస్పాండెంట్ ఎం.తులసి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం సాయంకాలం స్కూల్ సమీపంలో ఇళ్ల స్థలాలు కలిగిన వారికి అరుంధతివాడ వాసులకు మధ్య భూ వివాదం జరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారని తెలిపారు. ఉదయం స్కూలుకువచ్చే విద్యార్థులతో ఉన్న వ్యాన్లను కూడా వారు రాకుండా అడ్డుకున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులు అక్కడి నుంచి నడుచుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురై స్కూలుకు రావాల్సి వచ్చిం దని అన్నారు. ఈ ప్రాంతంలోని స్థల వివాదానికి అధికారులు చొరవ చూపి పరిష్కరించాలని ఆమె కోరారు.



సత్తాచాటిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

త్రోబాల్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నెల్లూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ అసోసియేషన్ పోటీలలో పట్టణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం విద్యార్థులు కె.మనోజ్ కుమార్,టి.మోక్షిత్ సత్తాచాటారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి వారణాసిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎన్.ప్రసాద్ తెలిపారు. త్రోబాల్ క్రీడలలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణ మన్నారు.ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయి పోటీలలో రాణించి మండల కీర్తిప్రతిష్టలను పెంచాలని ఆకాంక్షించారు. విద్యా ర్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడలతో మంచి గుర్తింపు లభించడంతో పాటు ఉన్నతమైన శిఖరాలకు చేరుకోవచ్చని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు పీడీ వెంకట శివప్రసాద్, ఉపాధ్యాయ, ఉపాధ్యా యేతర బృందం , విద్యార్థులు అభినం దించారు.

29 నుంచి అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి- నందలూరు

స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ స్కౌట్ గ్రూప్ సంస్థ 27వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 29 నుంచి మండల స్థాయిలో అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామరాజ్ తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా పాల్గొనాలని ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి ఆహ్వానించినట్లు తెలిపారు. తూ మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవ పల్లిలోని జడ్పి హైస్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 29వ తేదీన అథ్లెటిక్స్, 30న వాలీబాల్, 31న కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభించడం జరుగు తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్ర మంలో ఎంపిడిఒ కెఆర్‌ఎం ప్రసాద్, వైస్ ఎంపిపి అనుదీప్, మండల కో-ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్, తుమ్మల శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి విద్యార్థి సత్ప్రవర్తన, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరాలని పశుసంవర్ధక ఎడి రవీంద్రనాథ్‌రెడ్డి, గంగా రూరల్ ఎన్విరాన్మెంట్ సంస్థ అధ్యక్షుడు శివకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాలలో శని వారం నేటి తరం యువతలో స్ఫూర్తి నింపడానికి అనే అంశంపై శివకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ నేటి యువతరం ఆత్మ విశ్వాసం కలిగి ఉండాలని కోరారు. భవి ష్యత్తు తరాలకు బాసటగా విద్యార్థులు నిల వాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని సూచించారు. విద్యార్థులకు ఆర్థిక సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్ర మంలో శ్రీనివాస్ పాఠ శాల కరస్పాండెంట్ కేశవులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకటన

అన్నమయ్య జిల్లా రామాపురం మండలం రాచపల్లి గ్రామం బాలిరెడ్డిగారిపల్లిలో వెలసిన శ్రీ కోదండ రామాలయం ను దేవాదాయచట్టం 30/87 ప్రకారం రిజిస్ట్రేషన్ మరియు పబ్లికేషన్ చేయుటకు ఏవైనా అభ్యంతరాలు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7రోజుల లోపు రాయచోటి లోని అన్నమయ్య జిల్లా దేవాదాయ అధికారి గారికి తెలియజేయగలరని దేవాదాయ ఇన్స్పెక్టర్ సి.శివయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం :'ముక్కా'

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఆర్.రాచపల్లి నుంచి మల్లోరపల్లి వరకు తారు, సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ. 1.45కోట్లతో భూమిపూజ చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజలు, విద్యార్థులు, కార్మికులు సులభంగా రాక పోకలు సాగించేందుకు ఈ రహదారి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ రహదారి అభివృద్ధి పనులు పూర్తయితే ఈ ప్రాంతానికి శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ఆర్థిక సామాజిక అభివృద్ధికి సాధ్యమవుతుందని తెలిపారు. రోడ్డు నిర్మా ణంలో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేస్తూ అధికారులు, కాంట్రాక్టర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అత్యుత్తమ ప్రమాణాలతో పనులు పూర్తి చేయా లని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా సిమెంటు రోడ్డు లేకుండా ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే తక్షణమే రోడ్డు నిర్మాణానికి వేసేందుకు వెన కాడ బోమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



సిమెంట్ రోడ్డుకు భూమిపూజ నిర్వహిస్తున్న రూపానందరెడ్డి, ఎమ్మెల్యే

వేలం పాట ఆదాయం రూ.4.23 లక్షలు



వేలంపాట నిర్వహిస్తున్న డిఎల్‌పిఒ నాగరాజ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

చేపల చెరువుల వేలంపాట ద్వారా రాచవేటివారిపల్లె గ్రామ పంచాయతీకి రూ.4.23 లక్షల ఆదాయం చేకూరినట్లు మదనపల్లె డిఎల్‌పిఒ నాగరాజ తెలిపారు. శనివారం రాచవేటివారిపల్లె గ్రామ సచివాలయంలో సర్పంచు సుబ్రమణ్యం (మధు), పంచాయతీ కార్యదర్శి రజిత ఆధ్వర్యంలో చేపల చెరువుల వేలంపాటను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఎల్‌పిఒ నాగరాజు, ఎంపిడిఒ ఫక్రు ద్దీన్ సాహెబ్, ఎఒరమేష్ బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, జిఎస్‌డబ్ల్యూ డిప్యూటీ ఎంపిడిఒ లక్ష్మీపతి, రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ లు హాజరయ్యారు. పంచాయతీ పరిధిలోని 12 చెరువులకు వేలంపాట నిర్వహించగా రూ.4,23,500లు వేలంపాట ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరిందన్నారు. ఇందులో ఎర్ర చెరువును రూ. 1.50లక్షలు, పెద్ద ఒడ్డును రూ.57వేలకు గుండ్లబురుజుకు చెందిన ఎం.చంద్రశేఖర్ దక్కించుకున్నారు. పెద్ద చెరువును రూ.66 వేలకు ఎగువమాచిరెడ్డిగారి పల్లెకు చెందిన ఇ.వెంకటరమణ దక్కించుకున్నారని పేర్కొన్నారు. వేలం పాటదారులు సంబంధిత చెరువులలో 30/06/2026 తేదీ వరకు చేపల పెంపకం, చేపల విక్రయం చేసుకోవచ్చని వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజిత, సచివాలయ సిబ్బంది, వేలం పాటదారులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్స్ వితరణ

ప్రజాశక్తి - కలికిరి

2025-26వ సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి మోడల్ టెస్ట్ పేపర్స్ స్థానిక జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినికు యుటిఎఫ్ నాయకులు అందించారు. ఈ సందర్భంగా మదనపల్లి యుటిఎఫ్ అధ్యక్షులు బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఎన్‌సిసి మోడల్ టెస్ట్ పేపర్స్‌ను యుటిఎఫ్ నాయకత్వం రూపొందించిందన్నారు. గత పదవ తరగతి పరీక్షలలో కూడా 60 నుంచి 70 శాతం పైన ప్రశ్నలు యుటిఎఫ్ మోడల్ పేపర్స్ నుంచి వచ్చాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఎస్ఎస్‌సి పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికి ఉపయోగంగా ఉంటాయన్నారు. విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని మార్కు లతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం విద్యపై దృష్టి పెట్టి దాన్ని అభివృద్ధి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్స్ రాష్ట్ర కౌన్సిలర్ పి చంద్రశేఖర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా గౌరవ అధ్యక్షులు జి.రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయులు జయమ్మ, మాజీ ప్రధానోపాధ్యాయులు చంగల్‌రాయుడు, ప్రధానోపాధ్యాయులు రమేష్ రెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు జి.జయరామ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మోడల్ టెస్ట్ పేపర్లను చూపుతున్న విద్యార్థులు



సంస్థ జ్ఞాపికను అందిస్తున్న ఆశ్రమం సిబ్బంది

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి -మదనపల్లి టౌన్

ప్రముఖ హేతువాది పరివర్తన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కె.వెంకట్, సతీమణి డాక్టర్ భాగ్యవతమ్మ 82వ పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని దేవతానగర్‌లోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.వెంకట్, ఆయన కుమార్తె సృజన, రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివరామిరెడ్డి పాల్గొని చిన్నారులకు స్వయంగా భోజనాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకట్ మాట్లాడుతూ ఎంతోమంది పుణ్యఫలం కోసం దేవాలయాలు, తీర్థయాత్రలు చేస్తుంటారని, కానీ అనాథ చిన్నారులకు సేవ చేస్తున్న చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థే నిజమైన పుణ్యఫలమని పేర్కొన్నారు. అనంతరం ఆనంద వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడి వృద్ధులకు స్వయంగా భోజనం వడ్డించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసు కున్నారు. కేవలం దాతల సహకారంతో ఇంత పెద్ద ఆశ్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని కొనియా డారు. మానవసేవయే మాధవసేవగా భావించి ప్రతి ఒక్కరూ చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు విరా ళాల రూ పంలో సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎంపి.ఆనందన్, డాక్టర్ జి.వి.ఎస్.బాబు, జనరల్ సెక్రటరీ కవితారాణి, డాక్టర్ కె.వెంకట్ లకి సంస్థ జ్ఞాపికను బహూ కరిం చారు. కార్యక్రమంలో ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల అధ్యాపక సిబ్బంది, ఆనంద వృద్ధాశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమె మృతికి కారకులెవరు..ఈ పాపం ఎవరిది..?

కటికచలిలో ఆస్పత్రి ఆవరణంలో మహిళ మృతి

ప్రజాశక్తి-మదనపల్లి



మృతి చెందిన మల్లమ్మ

చికిత్సకు వచ్చి ఆస్పత్రిలో ఆరు బయటనే పడుకున్న మహిళ చలిలో ప్రాణం పోగొట్టుకున్న హృదయ విదారక ఘటన శనివారం మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో జరిగింది. తంబళ్లపల్లి మండలం, బలక వారిపల్లికి చెందిన రాగిణి వెంకటప్ప భార్య మల్లమ్మకు ఆరోగ్యం బాగలేకపోవడంతో చికిత్స చేయించుకునేందుకు శుక్రవారం రాత్రి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు చేతికి క్యాండిలా పెట్టి చికిత్స అందించారు. అంత పెద్ద ఆసుపత్రిలో పడుకోనివ్వకపోవడంతో ఆస్పత్రి ఆరు బయట స్లాబు కింద పడుకొని రాత్రంతా చలికి తట్టుకోలేక మృతి చెందింది. శనివారం ఉదయం ఆస్పత్రి సిబ్బంది మృతి చెందిన మహిళను గుర్తించారు. వెంటనే అత్యవసర విభాగంలోనికి తీసుకువచ్చి డాక్టర్లు పరీక్షించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇంత దారుణ ఘటన జరిగడానికి ఆసుపత్రి ఉన్నతాధికారులు, కొందరి ఉద్యోగులే కారణమని తెలుస్తోంది. ప్రభుత్వాసుపత్రి తమ సొంత జాగీరులా భావించి కొందరు రోగులను ఆసుపత్రి లోపల పడుకోవడానికి అనుమతించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దానికి తోడు రాత్రంతా చలిలో ఆరు బయట పడుకోవడం వల్ల మల్లమ్మ ప్రాణాలు పోగొట్టుకుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే కొందరు సిబ్బంది ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నా ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఒ ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మల్లమ్మ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుని ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే : బివైఎస్



మాట్లాడుతున్న పునీత్‌కుమార్

మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తంబళ్లపల్లెకు చెందిన ఒక మహిళ ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమని బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పునీత్ కుమార్ మండి పడ్డారు. బివైఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించిన ముఖ్య అంశాలను వివరించారు.తంబళ్లపల్లె నుంచి అత్యవసర స్థితిలో చికిత్స కోసం వచ్చిన మహిళను అడ్మిట్ చేసుకోకుండా, కనీస మానవత్వం లేకుండా సిబ్బంది బయటకు పంపించి వేయడం దుర్మార్గమన్నారు. ఆసుపత్రి వెలుపల కటిక చలిలో రాత్రంతా గడపడం వల్ల, సరైన వైద్యం అందక ఆ మహిళ అక్కడికక్కడే మృతి చెందడం హృదయ విదారకమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ వెంటనే మదనపల్లి ఆసుపత్రిని తనిఖీ చేసి బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు



త్రిసభ్య కమిటీ సభ్యులతో రమేష్‌నాయుడు, మహేష్‌నాయుడు

రైతు సేవా సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలం లోని తిమ్మసముద్రం గ్రామపంచాయతీలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీని ఎన్నుకున్నట్లు రైతు సేవ సహకార సంఘం మేనేజింగ్ డైరెక్టర్ కె.రెడ్డిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఛైర్మన్‌గా యం.రామనాథరెడ్డి, డైరెక్టర్లుగా చంద్రానాయక్, మడక రమణమ్మను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి రాజమ్మ , టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహేష్ నాయుడు, మండల ఇన్‌ఛార్జి రమేష్ నాయుడు, టిడిపి నాయకులు శివా రెడ్డి, శివకుమార్ నాయు డు, నాగ సుబ్బయ్య, జయరామయ్య నాయుడు, సర్పంచ్ హకీమ్, అసిస్టెంట్ రిజిస్టర్ హబీబుల్లా, లక్కిరెడ్డిపల్లి బ్రాంచ్ మేనేజెర్ రమణ రెడ్డి, సుండు పల్లి డిసిసిబి మేనేజర్ ముంతాజ్, తిమ్మసముద్రం మేనేజర్ రెడ్డిబాబు, జనసేన నాయకురాలురెడ్డి రాణి, అన్నమయ్య జిల్లా సంఘాల యూనియన్ అధ్యక్షులు సుబ్బారెడ్డి, రాష్ట్ర సంఘాల నాయకులు సాబ్జాన్, ఆంజనేయులు, జాఫర్, హరి, రెడ్డెప్ప, సుండుపల్లి సంఘ సిబ్బంది లక్ష్మి నారాయణ, లక్ష్మయ్య, శివ ప్రసాద్, శివ, తిమ్మ సముద్రం సంఘ సిబ్బంది జాశ్వంత్, కలీం, రాజ, సిద్దయ్య రైతులు, డిపాజిట్ దారులు, ఖాతా దారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రెస్‌క్లబ్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నూతన సంవత్సరం, సంక్రాంతి వారోత్సవాల్లో భాగంగా మదనపల్లె ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ ఉత్సాహంగా జరిగింది. శనివారం షటిల్ టోర్నమెంటులో పాత్రికేయులు ఐదు జట్లు డబుల్స్ టీంలో తలపడ్డారు. ఫైనల్స్ లో ఎబిఎన్‌గోపి, సివిఆర్ విజయ్‌లు గెలిచి విజేతలుగా నిలిచారు. సింగిల్స్ పోటీలలో టీవీ5 రమేష్, ఎబిఎన్ గోపి ఫైనల్స్ లో తలపడగా టివి5 రమేష్ విజేతగా నిలిచాడు. ఆదివారం స్థానిక జడ్‌పి మైదానంలో ఎలక్ట్రానిక్ మీడియా వర్సెస్ ప్రింట్ మీడియా క్రికెట్ మ్యాచ్ ఆడనున్నారు.



విజయ్‌కుమార్‌కు పుష్ప గుచ్ఛం అందిస్తున్న ప్రిన్సిపల్ రాయుడు

'ఆదిత్య'లో పరిశ్రమల దృష్టి కోణాలపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

స్థానిక మదనపల్లె సమీపంలోఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ విభాగం, టెక్నోవేటర్స్ సహకారంతో 'విఎల్ఎస్ఐ ఫిజికల్ డిజైన్, టైమింగ్ క్లోజర్‌పై పరిశ్రమ దృష్టికోణాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. ఉపన్యాసాన్ని సైంటిస్ట్ (బి) ఎన్.విజయ్‌కుమార్, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సి-డాట్), బెంగళూరు అందించారన్నారు. విఎల్ఎస్ఐ ఫిజికల్ డిజైన్‌లో పరిశ్రమ అవసరాలు, టైమింగ్ క్లోజర్‌లో ఎదురయ్యే సవాళ్లు, సెమికండక్టర్ రంగంలోని తాజా ధోరణులపై విద్యార్థులకు విలువైన అవగాహన కల్పించారన్నారు. అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు విఎల్ఎస్ఐ రంగంలోని కెరీర్ అవకాశాలపై అవగాహన పెరగడంతో పాటు పరిశ్రమలకు సిద్ధంగా మారేందుకు ప్రోత్సాహం లభించిందని తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాయుడు పేయ్యాల, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ కెవి.వరప్రసాద్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు పూలబొకెను అందిస్తున్న అంజనమ్మ

రాజంపేట పార్లమెంట్ కార్యదర్శిగా అంజమ్మ

ప్రజాశక్తి-కలికిరి

రాజంపేట పార్లమెంటు టిడిపి కార్యదర్శిగా కలికిరి మాజీ సర్పంచ్ గడ్డం అంజమ్మ నియమితులయ్యారు. శనివారం కలికిరి మండలం నగిరి పల్లి గ్రామంలో ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ నల్లారి చంద్ర కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి పుష్ప గుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజమ్మ మాట్లాడుతూ తనకు రాజంపేట పార్లమెంట్ కార్యదర్శిగా నియమించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదివి రావడానికి సహకరించిన సింగిల్ విండో ఛైర్మన్ నల్లారి చంద్రకుమార్‌రెడ్డికి, మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మీకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.అంజమ్మ కు రాజంపేట పార్లమెంట్ కార్యదర్శిగా నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మల్లిరెడ్డి, వెంకటరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాలతి, రెడ్డివారి యోగేష్ రెడ్డి, వాటర్ షెడ్ రవి, నిజాం, జనార్దన్ గౌడ్, దినకర్, వర్మ, జ్ఞానపాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో 16 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని స్థానిక రంగసముద్రం రోడ్డులో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం మాస్టర్ మైండ్ చెన్నై వారు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు.ఈ డ్రైవ్‌లో విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్, హెచ్ఆర్ రౌండ్లు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 16 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రన్సిపల్ ఎల్.ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ రాజేంద్రనాయక్ అభినందించారు. కార్యక్రమంలో పలు కంపెనీ హెచ్ఆర్‌లు మురళీకృష్ణ, సునీల్ కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి లోకేష్, మహబూబ్ బాషా, అధ్యా పకులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

క్రైం కార్నర్

పీలేరులో బాలుడు అదృశ్యం

ప్రజాశక్తి-పీలేరు




గోవిందుల చరణ్‌సాయి(ఫైల్ పొటో)

పీలేరులో ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన శనివారం వెలుగు చూసింది. సిఐ యుగంధర్ మీడియాకు తెలిపిన సమాచారం మేరకు..చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన గోవిందుల చరణ్‌సాయి (14) స్థానికంగా ఓ ప్రయివేట్ విద్యాసంస్థలో 10వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 12:30 గంటలకు పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోయాడని తెలిసింది. ఆ విద్యార్థి తల్లి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. ఎవరికైనా ఈ బాలుని ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించి సహకరించాలని సిఐ కోరారు. ఆచూకీ తెలిసినవారు సిఐ పీలేరు సెల్ నెంబర్ 9440796744, ఎస్ఐసెల్ నెంబర్ 9440796745, ఫిర్యాదుదారుల సెల్ నెంబర్: 8179801990 సమాచారం అందించాలని తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో దొంగ అరెస్టు

ప్రజాశక్తి-కలికిరి



ఫైరోస్ అరెస్టును చూపుతున్న పోలీసులు

వృద్ధురాలి నుంచి గొలుసును దొంగిలించిన కేసులో కర్నాటకు చెందిన నిందితుడిని అరెస్టు చేసినట్లు సిఐ కె.రావచంద్ర తెలిపారు. స్థానిక పట్టణంలోని పీలేరు రోడ్డులోని చదివే నరసింహారెడ్డి భార్య చదివే అరుణ కుమారి అనే వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తుందని తెలిపారు. ఆమె ఇంటి పక్కనే నివాస ముండే అబ్దుల్లా ఆమె బంగారు చైన్ ధరించి ఉండడం గమనించి దొంగతనం చేయాలని బెంగుళూరు లోని డీజే హళ్లి, మోడీ రోడ్‌కు చెందిన అతని స్నేహితుడు ఫైరోజ్ ను కలికిరికి పిలిపించాడని చెప్పారు. అరుణ కుమారి ఇంటికి ఫైరోజ్ ని పంపించి, ఆమె ఇల్లు బాడుగకు కావాలని మాటల్లో పెట్టి, ఆమె మెడలో ఉన్న బంగారు చైన్ లాక్కొని పారిపొయాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు పై కలికిరి అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.వి.రమణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వరంలో హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర ప్రసాద్, కానిస్టేబుల్ విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది రైతు నేస్తం ఎరువుల దుకాణం వద్ద ఉన్న సిసి కెమెరాలలో లభించిన పూటేజ్ ఆధారంగా, కర్ణాటక కు చెందిన ఫైరోజ్‌ను అరెస్ట్ చేశామని, అబ్దుల్లా పరారీలో ఉన్నట్లు తెలిపారు. అతడిని పట్టుకోవడం కోసం ఒక స్పెషల్ టీం ను పంపినట్లు తెలిపారు.. ఈ కేసు చేధనలో సిసి కెమెరా పూటేజ్ ఉపయోగపడిందని చెప్పారు.